# ఇది కథ కాదు

మామిడితోటకి, కాలవగట్టుకి మధ్య బాడ్మింటన్ కోర్టు చూస్తే భలే సరదా వేసింది మూర్తికి.

"మామిడిపళ్ళు తిని-బాడ్మింటన్ ఆడుకుంటూ, కాలవలో ఈతలు కొడుతూ ఎన్నాళ్ళయినా వుండిపోవచ్చురా కృష్ణా మీ వూళ్ళో!" అన్నాడు నవ్వుతూ రామకృష్ణతో.

ప్రతి వేసవికాలం మామిడిపళ్ళకోసం మేనత్తగారి వూరు రావటం మూర్తికి బాగా అలవాటు.

రామకృష్ణా, మూర్తీ చిన్నప్పుడు "బావా" "బావా" అని పిల్చుకునేవాళ్ళు పెద్దవాళ్ళు చెప్పినట్టు. హైస్కూల్లో అలా పిల్చుకుంటూంటే ఎవరో నవ్వారని యిద్దరూ మానేశారు. స్కూలుఫైనల్ పాసై, కాలేజీలో కూడా కలిపే చేరారు ఇద్దరూ.

హఠాత్తుగా తండ్రి పోవటంతో రామకృష్ణ అయిష్టంగానే చదువుకి

స్వస్తి చెప్పి పొలం వ్యవహారాలు చూసుకోక తప్పలేదు—రామకృష్ణకీ మూర్తికీ స్నేహమే ఎక్కువ.

మూర్తి మాటలకి—

"ఐదారు నెలలనుంచీ ఆడుతున్నాం. ఫుల్ టీమ్ వుంది తెలుసా? కొంతమంది వూళ్ళో లేరుగాని చూస్తే నువ్వు భలే సర్దా పడేవాడివి" అన్నాడు రామకృష్ణ నెట్ కడుతూ.

మూర్తి బాడ్మింటన్ చాలా బాగా ఆడతాడు. కాలేజీ గేమ్స్‌లో ఎప్పుడూ సెంటర్ ఆడుతుంటాడు. రామకృష్ణ కబురంపితే మరో ఇద్దరు వచ్చారు. నలుగురూ ఆడటం మొదలుపెట్టారు. చూస్తోండగానే మూర్తి జట్టుకి పది పాయింట్లు వచ్చాయి.

"మావాడు మామిడిపళ్ళు మేసి తెగ గంతులేస్తున్నాడు" అన్నాడు కసిగా రామకృష్ణ.

"ఏడిశావులే. ఎత్తు ముందు" అంటూ విసిరికొట్టాడు మూర్తి బంతిని.

రామకృష్ణచాకచక్యంగాతిప్పికొట్టాడు. ఫ్రంట్‌ని తప్పించుకుంటూ వచ్చిన బంతిని వెనక ఆడుతోన్న మూర్తికూడా వదిలేశాడు, కాలవగట్టు వైపు ఆశ్చర్యంగా చూస్తూ.

ఒక ఆడమనిషిని వెనకాల కూర్చోబెట్టుకుని ఒక మొగవాడు సైకిలు తొక్కుకుంటూ వస్తున్నాడు. అలాంటి దృశ్యం కొత్తేంకాదు మూర్తికి. కానీ ...ఇక్కడ....ఈ పల్లెటూళ్ళో .... యింత పబ్లిగ్గా .... "వాహ్! ఏం జంటరా! చూడముచ్చటగా వుంది" అనేశాడు అప్రయత్నంగానే.

సైకిల్ కోర్టుపక్కనుంచే ముందుకు వెళ్ళిపోయింది. మూర్తి ఇద్దర్నీ బాగా చూశాడు. మొగవాడు పంచి కట్టుకున్నాడు. చొక్కామీద ఉత్తరీయం వేసుకున్నాడు. ఆడది ఎర్రటిచీర కట్టుకుంది. బిర్రుగా జడ వేసుకుంది. మొగవాడికి ముప్పై....ఆడదానికి పాతిక దాటి వుంటాయి.

మూర్తి చూసి చూసి వెనక్కి తిరిగివస్తూ "ఈ పల్లెటూరి పక్షులకి సైకిల్ యాత్రేవిటిరా?" అన్నాడు వెటకారంగా.

"ఏడిశావ్‌లే మీ కాలేజీ! అనుకున్నా వేమిటి? వాళ్ళు వింటే?"

"ఏం వింటే? నేనేం తిట్టలేదుగా ; మీ వూరే నయం. మెడ్రాస్‌లా వుంది."

"ఒరేయ్! వాళ్లేం కావ్వేక్కి షికార్లు చేయటం లేదురా!"

రామకృష్ణతో పాటు మిగతా ఇద్దరూ కూడా అసలు విషయం చెప్పారు మూర్తికి.

"ఆ సైకిల్ తొక్కే అతని పేరు చంద్రన్న. వడ్రంగంపని చేస్తాడు. ఊళ్ళో రైతులందరికీ నాగళ్ళ దగ్గర్నుంచీ ఆడవాళ్ళ అప్పడాల కర్రల వరకూ చేసి యిస్తూంటాడు. సైకిల్ వెనకాల కూర్చున్నది చంద్రన్న పెళ్ళాం. పేరు కాంతమ్మ. ఆవిడకు ఓ నెల్లాళ్ళక్రిందట ఏదో జబ్బుచేసి కాళ్ళు పడిపోయాయి. అప్పట్నుంచీ నడవటంలేదు. మంచంమీదే అన్నీ. జబ్బు ముమ్మరంగా వున్నప్పుడు నాలుగైదుసార్లు పొరుగూరునుంచి డాక్టర్‌ని ఇంటికి తీసుకొచ్చాడు చంద్రన్న- అప్పటికే చాలా ఖర్చయింది. కాంతమ్మకి రోజూ యింజక్షన్ యివ్వాలి.

"ఊళ్ళోవున్న మాత్రల పుల్లయ్య తప్పతాగి ఇంజక్షన్లిస్తూంటాడు. వాడితో యింజక్షన్ చేయించుకున్నవాళ్ళు ఓ నెల్లాళ్ళ తర్వాత తప్పకుండా ఆపరేషన్ చేయించుకోవాలి. అందుచేత చాలామంది పొరుగూరు పోతూ వుంటారు.

"కాంతమ్మ జబ్బుపడ్డ దగ్గర్నుంచీ చంద్రన్న యింటిపనులు కూడా తనే చూసుకుంటున్నాడు. పదేళ్ళ కొడుకూ ఏడేళ్ళకూతురూ వున్నారు. వాళ్ళిద్దరూ బడికి పోతారు.

"ఇంజక్షన్‌కోసం పొరుగూరు డాక్టర్ దగ్గిరికి వెళ్లాలంటె అద్దెబండి కట్టించుకోవాలి. చంద్రన్నలాంటి వాళ్ళకి అది సాధ్యంకాదు. అద్దెసైకిల్ అయితే ఒక్క పావలాతో అయిపోతుంది. గంటలో వెళ్ళి వచ్చేస్తాడు.

"వారంరోజుల్నుంచీ అలా తీసికెళ్తున్నాడు. మొదట్లో రెండు మూడు రోజులు అందరూ నవ్వుకున్నారు. చంద్రన్న ఎవరి నవ్వులూ పట్టించుకోలేదు. పెళ్లాన్ని రోజూ డాక్టర్ దగ్గిరికి తీసికెళ్ళి ఇంజక్షన్లు చేయించుకొస్తూనే వున్నాడు.

అంతాచెప్పి "చూశావా? అసలు సంగతేవిటో తెలీకుండా ఏం జంటరా అని చూశావ్" అన్నాడు రామకృష్ణ మూర్తినిచూస్తూ కోపంగా. నిజంగా మూర్తి నొచ్చుకున్నాడు .... "ఛ! లేదురా! నాకు తెలీదురా! ఏదో అనుకున్నారా!" అని సంజాయిషీ చెప్పుకున్నాడు.

"సరే! సరే! ఈసారేం వాగకు, ఆడు" అంటూ రామకృష్ణ కోర్టులోకెళ్లి నించున్నాడు.

చీకటిపడేవరకూ ఆడుతోనే వున్నారు. చంద్రన్న తిరిగివస్తోంటే ఫ్రంట్ వెంకట్రావు చెప్పాడు మూర్తికి. మూర్తి నిలబడి చూశాడు వెళ్ళిపోతున్న సైకిల్ని.

చీకట్లో యిద్దరూ ఆనవాలు తెలీలేదు. ఎర్రచీర నల్లచీరలా కనబడింది. ఈసారి వాళ్ళనిచూస్తే చాల జాలేసింది. చాలా ఆశ్చర్యం కలిగింది.

రెండోరోజుకూడా చంద్రన్న కాంతమ్మని తీసుకెళ్ళటం, తీసుకు రావటం చూశాడు మూర్తి.

సైకిల్ వెళ్ళిపోయాక కృష్ణతో అన్నాడు—

"అతను చాలా మంచివాడురా!"

"ఎవరు?"

"అతనే, చంద్రన్న."

"ఏం? ఎందుకూ?"

"ఎందుకేమిటి?"

ఎందుకో చెప్పలేదు మూర్తి.

పదిరోజుల్నుంచీ రోజూ చంద్రన్ననీ, కాంతమ్మనీ చూస్తోనే వున్నాడు మూర్తి. ఇద్దరూ బాగా పరిచయస్తుల్లా కన్పిస్తారు దూరం

నుంచే, చంద్రన్న బట్టలెప్పుడూ మాసినట్టే వుంటాయి. ఒక్కరోజు భుజంమీద తుండుగుడ్డ ఉండేది. ఒక్కోరోజు వుండదు. కాంతమ్మ ఎర్ర చీరో, నల్లచీరో తప్పితే మరో రంగు చీర కట్టడం చూడలేదు. జడ బిగించి కడీలా వేసుకుంటుంది. కళ్ళనిండా కాటుకా, బొట్టూ కొట్టవచ్చినట్టు కన్పిస్తూంటాయి. మనిషి అందమైందే. తెల్లగావుంటే ఎంతో అందంగా వుండేది. సైకిలు కోర్టుకి దగ్గరగా వచ్చేసరికి కాంతమ్మ మొహం అటు తిప్పేసుకుని కూర్చుంటుంది.

వెళ్ళేటప్పుడుకంటే-వచ్చేటప్పుడు వాళ్ళిద్దరూ హుషారుగా యింటికెళ్ళిపోతోన్నట్టు తోస్తుంది మూర్తికి. మూర్తి అప్రయత్నంగా అనేస్తాడు "చంద్రన్న చాలా మంచివాడు" అలా అనకపోతే ఏదో బరువుగా వుంటుంది గుండెల్లో.

"రోజూ మమ్మల్నేం కాల్చుకు తింటావురా. ఓసారి చంద్రన్నతో చెప్పు, సంతోషిస్తాడు" అన్నాడు రామకృష్ణ విసుగ్గా. చాలాసార్లు ఆ సైకిల్ని చూస్తూ మూర్తి ఆట ఇంటరెస్టింగ్‌గా ఆడటంలేదని కృష్ణ చిరాకు.

ఓనాడు మిట్టమధ్యాహ్నం వరకూ ఫెళ్ళున ఎండకాసి, హఠాత్తుగా జోరున వాన కురవటం మొదలుపెట్టింది. సాయంత్రం నాలుగ్గంటల వరకూ ఎడతెరిపి లేకుండా కురిసి వెలిసిపోయింది. మళ్లా భళ్ళున ఎండ వచ్చింది. ఓ సంవత్సరంనుంచీ వానలు కురవనంత నిర్మలంగా అయిపోయింది ఆకాశం.

బాడ్మింటన్‌కోర్టు అంతా బురదగా వుంటుందని ఆ రోజుకి ఆట విరమించి మామిడితోటలో షికారుకి పోయారు, మూర్తీ - రామకృష్ణా. మామిడాకుల్లోంచి జలజలా ముత్యాల్లా నీటిచుక్కలు రాలిపడుతోంటే తడిసినా మెత్తపడని ఎండుటాకులమీద నడుస్తూ తోటంతా తిరిగి తిరిగి ఒక కొమ్మమీద కూర్చున్నారు ఇద్దరూ.

హఠాత్తుగా గుర్తువచ్చి కాలవగట్టుకేసి చూశాడు మూర్తి. కాంతమ్మ ఒక్కతే సైకిల్‌మీద కూర్చునివుంది. చంద్రన్న సైకిల్ పట్టు

కుని బురదలో నడిపిస్తున్నాడు. బురదకి జడిసి కాలవగట్టుదారి వదిలేసి మామిడితోట పక్కనుంచి సైకిల్ నడిపించుకు వెళ్తున్నాడు.

"అతనితో ఏదన్నా మాట్లాడరా కృష్ణా" కుతూహలంగా అన్నాడు మూర్తి.

"ఏం మాట్లాడమంటావ్?"

"ఏదో ఒకటి. నీకు తెల్సినవాడేగా? ఆవిడకెలా వుందో అడుగు."

"బావుందిరా నీ గోల...." అని కంఠం కాస్త పెద్దదిచేసి — "ఇంకా ఎన్నాళ్ళు వెళ్లాలి చంద్రన్నా?" అన్నాడు రామకృష్ణ చంద్రన్నకి వినపడేలా.

చంద్రన్న మొహంత్రిప్పి తోటలో కృష్ణనిచూసి నవ్వుమొహంతో "ఇంకా ఐదారువారాల వరకూ వెళ్లాలబ్బాయిగారూ!" అన్నాడు.

"ఏమైనా నయమేనా?"

"ఆఁ బాగాగుణం కనిపించిందండీ! ఇప్పుడు కొంచెం నడవగల్దు."

"ఇవాళ బురద బురదగా వుందిగదా? మానెయ్యలేక పోయావా?"

"ఫర్వాలేదులెండి బాబూ! మానేస్తే ఏలాగ? ఎళ్తానండీ" అంటూ ముందుకు నడిపించుకు పోయాడు సైకిల్ని.

"నిజంగా ఇంత మంచి మనిషిని నే నెప్పుడూ చూళ్లేదురా!" అన్నాడు మూర్తి.

కృష్ణ నవ్వి "నువ్వే చంద్రన్న స్థితిలో వుంటే ఏం చేస్తావు? పెళ్లానికి వైద్యం చేయించకుండా పుచ్చుబెట్టుకుంటావా? కాస్త బుద్ధీ జ్ఞానం వున్నవాడు కాబట్టి కష్టమో నిష్ఠూరమో భరిస్తున్నాడు. ఇందులో గొప్పతనాని కేముంది?" అన్నాడు.

"అవుననుకో.... అయినా" అంటూ నసిగాడు మూర్తి.

ఇద్దరూ ఏవేవో కబుర్లు చెప్పుకుంటూ చాలా సేపు కూర్చున్నారు.

చీకటి పడుతోంటే లేచి వూళ్ళోకి వెళ్లారు. పశువులన్నీ వీధులు బురద బురద చేసుకుంటూ యిళ్ళకి వస్తున్నాయి. మొగవాళ్ళు కావిళ్ళతో నీళ్ళు తెచ్చుకుంటున్నారు. పిల్లలు తపతపా నీళ్ళలో నడుస్తూ పడుతూ

లేస్తూ ఆడుకుంటున్నారు. బురద వాసనా_గడ్డి వాసనా, పేడవాసనా అన్నీ కలగలుపుగా గుబాళిస్తున్నాయి. మూర్తి హాయిగా గాలి పీల్చుకుంటూ "మీ వూరు ఎంత సొగసుగా వుందిరా!" అన్నాడు నవ్వుతూ.

నిజంగా మూర్తికి పల్లెటూళ్ళంటే చాలా యిష్టం. అప్పుడప్పుడు వచ్చి ఈ వీధుల్లో తిరుగుతూ చిన్నప్పటి రోజులన్నీ గుర్తుచేసుకుంటే ఎంతో కమ్మగా వుంటాయి.

నడుస్తోన్నవాడల్లా ఆగిపోయాడు మూర్తి. "అదేనా చంద్రన్నా వాళ్ళ యిల్లు?" అటు చూస్తూ అడిగాడు. "అమ్మవచ్చేసింది. అన్నా?" అని సంతోషంగా అరుస్తోంది ఆడపిల్ల గుమ్మంలో నించుని.

చంద్రన్న రోడ్డుమీద సైకిల్ నించోబెట్టాడు. గుమ్మం దగ్గరకు వెళ్ళటానికి దారి బురదమయంగా వుంది. చంటిబిడ్డని పొత్తిళ్ళలో వేసుకున్నట్లు కాంతమ్మని రెండుచేతుల మధ్య పట్టుకున్నాడు. రెండు అంగలు వేసి యింట్లోకి వెళ్ళిపోయాడు. రెండు నిమిషాల్లో బయటికొచ్చాడు.

రోడ్డుమీద నిలబడ్డ రామకృష్ణని చూస్తూ—

"రండి అబ్బాయిగారూ! నిలబడ్డారేం? లోపలికి రండి" అన్నాడు అభిమానంగా.

"అబ్బే! ఎందుకూ? మా మూర్తిరేపు వెళ్ళిపోతాడని కాస్సేపలా తిరిగి వస్తున్నా ఫర్వాలేదు" నువ్వు వెళ్ళి సైకిల్ యిచ్చెయ్యి- మేమిలా వెళ్ళిపోతాం" అన్నాడు రామకృష్ణ.

మూర్తికి మాత్రం చంద్రన్న యింట్లోకి తొంగి చూడాలనేవుంది. ఏమీ అనకుండా రామకృష్ణతోపాటు నడక సాగించాడు.

"వాళ్ళిద్దరూ చాలా యిష్టంగా వుంటారనుకుంటాను కదూ?"

"ఏమో! ఎవడికి తెలుసు? వాళ్ళింట్లో దూరి చూశామా?"

"అది కాదు వూళ్ళోమాట."

"నాకంతగా తెలీదురా! మా అమ్మనడుగు చెప్తుంది" మూర్తి మరేమీ అడగలేదు.

ముందు నడుస్తోన్నా వూహలు వెనక్కి పరిగెట్టాయి. చిన్నపిల్ల

లైతే గుమ్మంలోకైనా వెళ్ళి తొంగి తొంగి చూడవచ్చు. ఎంత బావుంటుందో. చంద్రన్న కాంతమ్మని లోపలికి తీసుకుపోయి మంచం మీద పడుకో బెట్టాడేమో!

మళ్ళా యింటికివచ్చి వంట చేస్తాడు. పిల్లలకి తిళ్ళు పెడతాడు. పెళ్ళానికి అన్నం పెట్టి, తనూ తింటాడు.

నిజంగా కాంతమ్మ భర్తని చూచుకుని ఎంత పొంగిపోతుందో! "నేను మంచంలోంచి లేవాలిగాని.... అప్పుడు మీకెంత సేవ చేస్తానో చెప్పలేను" అన్నట్టు — పొంగి పొర్లుతోన్న కృతజ్ఞతతో చూస్తూ వుంటుంది.

చంద్రన్న నవ్వి– "నువ్వు మంచంలోంచి లేచాక నన్ను పడుకో బెడతావా?" అంటాడేమో హాస్యంగా.

రేపు కాంతమ్మకి బాగుపడిపోయినా వాళ్ళిద్దరూ ఇంకా అతుక్కు-పోయినట్టు అవుతారు.

• • •

"నిజంగా....కష్టాలే మనుషుల్ని సన్నిహితం చేస్తాయి" అన్నాడు. మూర్తి ఎవరికో నచ్చచెప్తోన్నట్టు. కృష్ణ వినిపించుకోలేదు.

మూర్తి వాళ్ళవూరు వెళ్ళిపోయాడు. టౌన్‌లో .... కాలేజీ వాతావరణంలో — కలసిపోయాడు.

కాలవ ఒడ్డున.... చంద్రన్నా .. కాంతమ్మా.... సైకిల్ మీద .... ఎప్పుడు గుర్తువచ్చినా.... దాన్నో పవిత్ర స్మృతిలాగ నెమరు వేసుకుంటాడు. దాన్ని జీవితమంతా గుర్తువుంచుకోగలిగితే ఎంతో మేలు చేస్తుంది తనకి. ముందు ముందు .... మరో వ్యక్తితో జీవితాన్ని పంచుకునే కాలంలో మార్గదర్శకంగా నిలుస్తుంది. చంద్రన్నకి వున్నంత మంచితనం తనకి వుంటే.... ?

• • •

ఏడెనిమిది నెలల తర్వాత రామకృష్ణ మూర్తికి పెద్ద వుత్తరం రాశాడు— కుశల ప్రశ్నలు వేశాడు. క్షేమ సమాచారాలు చెప్పాడు. నెమ్మదిగా విషయం ప్రారంభించాడు—"అసలు ఇందుకే నీకు ఉత్తరం మొదలు పెట్టాను. నీకో విశేషం రాయాలి. మా వూళ్ళో కాంతమ్మ గుర్తుందా? చంద్రన్న భార్య—కాళ్ళు పడ్డాయనీ–అప్పుడు సైకిల్ మీద–అప్పుడే మర్చిపోయి వుండవు—ఆ కాంతమ్మ ఏం చేసిందో తెలుసా?..."

ఆత్రుతలో గుండె స్పీడు అందుకొంది మూర్తికి.

"నిన్ను కాస్సేపు వూరించాలని వుందిరా! ఈ కబురు వింటే నీ మొహం ఎలా అవుతుందో చూడాలనిపిస్తోంది. తిట్టుకుంటావేమో! చెప్పేయ్యనా ?"

వారం పదిరోజుల క్రిందట ... కాంతమ్మ ....

మా వూళ్లో బైరాగులు పెలర్‌తో లేచిపోయింది. లేచిపోయిందిరా! చంద్రన్నని వదిలేసి వెళ్ళిపోయింది."

అదిరిపడ్డాడు మూర్తి. స్థాణువై నించున్నాడు. చాలాసేపు వుత్తరం చదవకుండా అదిరిపాటు స్థితిలో వుండిపోయాడు.

చైతన్యం కలగ్గానే రామకృష్ణ ఉత్తరంమీద నమ్మకం పోయింది. వాడేదో తనని వెర్రెత్తించటానికి రాసివుంటాడు.

కాంతమ్మ .... లేచిపోవటం ఏమిటి ? మళ్లా ఉత్తరంలోకి చూశాడు — "నువ్వు నమ్ముతావో లేదో! వాళ్ళిద్దరూ దేశాలు తెగించి పోలేదు. పక్క వూళ్ళోనే కాపరం పెట్టారు. అక్కడ బైరాగులవాడి అప్పగారుందిట. ఆ యింట్లో ఓ గదిలో వుంటున్నారట. చంద్రన్న తాలూకు వాళ్ళు వెళ్ళి పిల్చుకురాబోతే రాను పొమ్మందట. ప్రస్తుతం వాళ్ళిద్దరూ ఆ వూళ్ళోనే వున్నారు.

ఇప్పుడేమంటావ్ ?

అసలు నువ్వెళ్ళిన దగ్గర్నుంచీ వాళ్ళిద్దరిమీదా నాకు కుతూహలం పుట్టింది. వాళ్ళ సంసారం గురించి వాకబు చేశాను. దాని గుణం మంచిది

కాదని చంద్రన్నకి చాలాకాలం నుంచీ తెలుసట— కోపం వస్తే గొడ్డుని బాదినట్టు బాదేవాడట.

తీరా అది జబ్బుపడింది. ఏంచేసాడు? పారేసుకుంటాడా? ఇంట్లో పండుకుని మూలుగుతోంటే ఏదో చెయ్యాలికదా? అలాగే తనకి చేత నయింది చేశాడు.

ఏదో ఘనకార్యం చేసేస్తున్నానని వాడూ అనుకోలేదు. అదీ అనుకోలేదు.

కాంతమ్మకి ఎన్ని జన్మలెత్తినా మొగుడిమీద ప్రేమ పోదన్నావుగా? ఇప్పుడిలా ఎందుకు చేసిందంటావు? వాడు చేసిందంతా దానికి సామాన్యంగా కన్పించింది. ఎవడికోసం చేసాడులే? అన్న ధోరణితో ఆలోచించిందేమో! నువ్వన్నట్టు మొగుడిమీద ఏమన్నా కృతజ్ఞతవున్నా — నాలుగయిదు నెలలకి అది మరుగున పడిపోయింది. వాడు మళ్ళా కోపంవచ్చి కొట్టిన్నాడు పూర్తిగా హరించిపోయింది.

చూశావా మూర్తీ మనుషులెంత సామాన్యమైనవాళ్ళో? అష్టకష్టాలు పడి దాని కాళ్ళు బాగుచేయించినవాడు మళ్లా దాన్ని చావగొట్టడం ఎందుకు? ఇష్టంలేకపోతే పొమ్మనరాదూ?

తనకోసం — మొగుడు అప్పులపాలై యిల్లూ ఒళ్ళూ గుల్లచేసుకొని అంత చాకిరీ చేస్తే మళ్లా అది తప్పుడుపని చేసుందా? కృతజ్ఞత మాట అలావుంచి బుద్ధి, జ్ఞానం వుందా? బాగా ఆలోచిస్తే మనుషులంతా యింతే—మనంకూడా యింతే మూర్తీ!

ప్రేమ—కృతజ్ఞత—అభిమానం—కోపం—ద్వేషం — ఇవన్నీ అప్పటికప్పుడు రేగే అనుభూతులేగానీ— పోయిన పొడుగునా వుండవు.

ఎలాంటి ఆటంకం లేకపోయినా కొన్నాళ్ళకి పోతాయి. ఒకనాడు బలంగా వూపిన వూపు క్రమంగా బలహీనమైపోతుంది.

మన అభిప్రాయాలు ఎప్పటికప్పుడు చంచలంగా తిరుగుతూంటాయి.

ఇదే నిజంగాకపోతే కాంతమ్మ అలాంటి ఘోరం చేసివుండదు. అది మాత్రం మనిషికాదా?

ఆ ఉత్తరమంతా ఎప్పటికప్పుడే చీరెయ్యాలనుకుంటూ గబగబా చదివేశాడు మూర్తి. మూర్తి స్థితి వర్ణనాతీతంగా వుంది.

కాంతమ్మ .... చంద్రన్నని వదిలేసిందా? మనిషిజన్మ ఎత్తి అలాంటి ఘోరం ఎలా చెయ్యగలిగింది.

జీవితంలో అనుభూతులన్నీ అబద్ధమా? ప్రేమ శాశ్వతంగా వుండదూ? కృతజ్ఞత మనిషిని బంధించదూ?

మన అభిప్రాయాలు స్థిరంగా వుండవూ? మంచిచెడ్డల తారతమ్యం మనిషి అర్థం చేసుకోలేడూ? ఎంత అబద్ధం! మనిషిని ఇంత దారుణంగా నిర్వచించే వాళ్ళ నేమనాలి?

మూర్తి రామకృష్ణకి వెంటనే జవాబు రాశాడు – "చంద్రన్న దేవుడు! కాంతమ్మ రాక్షసి! వాళ్ళ అర్హతలు గుర్తించిన నేను మనిషిని. ఇద్దరికీ ఒకటే విలువ కట్టిన నువ్వు.... పశువ్వి.... పశువ్వి!"

(ఆగస్టు 67 యువజ్యోతి నుంచి)

....(o)....